COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE
H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**30 జూన్, 2019**

## కామ్రేడ్ గుంటూరు బాపనయ్య శతజయంతిని ఈ సంవత్సరం ఉద్యమంగా నిర్వహించాలని సిపిఐ(యం) పిలుపు

చల్లపల్లి జమిందారీ వ్యతిరేక పోరాట యోధుడు, వ్యవసాయకార్మిక సంఘం నేత కామ్రేడ్ గుంటూరు బాపనయ్య గారి శతజయంతి 2019లో వస్తుంది. దీనిని ఉత్సవంగా నిర్వహించాలని 2019 జూన్ 25, 26 తేదీలలో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.

బాపనయ్య కృష్ణాజిల్లా మోపిదేవి మండలం నాగాయతిప్పలో ఓ నిరుపేద దళిత వ్యవసాయ కార్మిక కుటుంబంలో 1919లో జన్మించారు. ఆ రోజుల్లో నాగాయతిప్ప నుంచి స్కూలుకు అవనిగడ్డ వెళ్లి చదువుకోవాల్సి వచ్చేది. బాపనయ్య పడవ మీద వెళ్తుంటే అగ్రవర్ణ భూస్వాములు గోచితో ఉన్న బాపనయ్యను పడవ నుండి దించేశారు. అంటరానితనం తీవ్రంగా ఉన్న రోజులవి. ఒకరోజు అదే పడవలో ప్రయాణిస్తున్న బసవపున్నయ్య ఆ అగ్రవర్ణ దురహంకారాన్ని తప్పు పట్టి ఎదురించి బాపనయ్యను రేవు దాటించారు. కుల పీడనకు వ్యతిరేకంగా, సామాజిక న్యాయం సాధనకూ పోరాడుతున్న ఎర్రజెండా వైపు ఆకర్షితులైనారు. చివరివరకు ఎర్రజెండా బిడ్డగానే కన్నుమూసారు.

చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగా సాగిన పోరాటానికి చండ్ర రాజేశ్వరరావు, చల్లపల్లి నారాయణరావుతోపాటు కలిసి పనిచేసారు. ఆ పోరాటంలో జైళ్ళు, పోలీసుల నిర్బంధాలు లాఠీ దెబ్బలకు, గుర్రాలతో తొక్కించినా వెనుదిరగలేదు. సుమారు ఆరువేల ఎకరాల లంక భూములు సాగుదార్ల చేతిలోకొచ్చాయి. పాలేర్ల జీతాల పెంపుదలకు పోరాడారు. 1948లో జమీందారీ విధానం రద్దు, దున్నేవాడికే భూమి కోసం ఉవ్వెత్తుగా సాగిన పోరాటాల తరువాతనే భూ సంస్కరణల చట్టాలు, బంజరు భూములను పేదలకు పంచే ఎసైన్‌మెంట్ చట్టాలు, పేదలకు నివేశనా స్థలాలు పంచే చట్టాలు వచ్చాయి. పేదలపక్షాన పోరాడుతున్న బాపనయ్యను ప్రభుత్వం అక్రమంగా అరెస్టుచేసి రాజమండ్రి, కడలూరు జైళ్లలో 1951 వరకూ నిర్బంధించింది.

1977 నవంబర్ 19న వచ్చిన ఉప్పెనలో దివిసీమలో 10 వేల మంది చనిపోయినప్పుడు సుందరయ్య, బసవపున్నయ్య, జ్యోతిబసుల సూచనలతో పార్టీ ఆధ్వర్యంలో కోడూరు, నాగాయలంక, బందరులలో రెండు నెలలపాటు అవిశ్రాంతంగా సహాయ పునరావాస కార్యక్రమాలను నిర్వహించారు.

కామ్రేడ్ బాపనయ్య పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా రాష్ట్ర పార్టీ కార్యదర్శివర్గ సభ్యులుగా, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులుగానూ పనిచేశారు. మూడుసార్లు శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. శాసనమండలి సభ్యులుగా పనిచేశారు. ప్రభుత్వం నుండి వచ్చే జీతాలు పార్టీకి ఇచ్చి పార్టీ ఇచ్చే అలవెన్సుతోనే జీవితాన్ని గడిపారు. అవిశ్రాంత పోరాట యోధుడు బాపనయ్య తన 58వ ఏట 1978 మార్చి 25 కన్నుమూశారు. బాపనయ్య పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ వ్యవసాయ కార్మికుల స్థితిగతులు మార్చడానికి, సమాజంలో కులవివక్షతను అంతమొందించేందుకు భారతకమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) కట్టుబడి ఉంది. కామ్రేడ్ బాపనయ్య శతజయంతిని పురస్కరించుకొని ఈ ఏడాది పొడవునా పార్టీ కమిటీలు సెమినార్‌లు నిర్వహించాలని రాష్ట్ర కమిటీ పిలుపునిస్తుంది.

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి